నేటి నిజం సాహితీ కెరటాలు
website:www.netinijam.com
website: www.netinijam.com
2 హైదరాబాద్ | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | గురువారం 8-6-2023

## నానీ



అతడు వెళ్ళిపోతూ
ఆమెకిచ్చిన ఆస్తి
కళ్ళనిండా
జీవనదులు



-డా. సి. భవానీదేవి
9866847000

## ఘంటారావం

అవతలివారి ప్రగతికి
అతలాకుతలమవుతున్నావా?
కుతకుతలాడే మనసు
గతి తప్పుతుంది కదా.

చెడ్డవారితో
స్నేహం చేయకు
సర్పంతో
సావాసమని మరువకు.

కాలం కదలిపోయాక
కనువిప్పు కలిగితే ఎలా?
కాలచక్రం
వెనక్కి వెళ్ళదుకదా



-గంటా మనోహర్‌రెడ్డి
సెల్:9949992964

# యువకళా వాహిని ఆధ్వర్యంలో కొలకలూరి ఇనాక్‌కు జీవన సాఫల్య పురస్కారం, స్వర్ణకంకణ ప్రదానోత్సవం

చెమట చిందించి, ఎన్నోకష్టాలు అధిగమించి సమాజాన్ని మేల్కొలిపేందుకు కృషి చేసిన ఆచార్య కొలకలూరి ఇనాక్ ఆశయాలను నెరవేర్చేలా రచనలు చేయడం, రాజ్యాంగ స్పూర్తిని పెంపొందించడమే ఆయనకు మనం ఇవ్వగలిగే అసలైన గురుదక్షిణ అని సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్.వి.రమణ అన్నారు. సోమవారం రాత్రి పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో యువకళావాహిని ఆధ్వర్యంలో ప్రముఖ సాహితీవేత్త, శ్రీ వేంకటేశ్వర వర్సిటీ పూర్వ ఉపాధ్యక్షులు ఆచార్య ఇనాక్‌కు జీవన సాఫల్య పురస్కారం, స్వర్ణ కంకణ ప్రదానోత్సవం జరిగింది. తెలంగాణ ప్రభుత్వ సలహాదారు డా॥కె.వి.రమణాచారి అధ్యక్షతన జరిగిన సభలో జస్టిస్ ఎన్.వి.రమణ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. "కొలకలూరి ఇనాక్ ప్రభుత్వ ఉద్యోగిగా ఉండి కూడా కవి సమ్మేళనాల్లో ప్రభుత్వం మీద చురకలు అంటినస్తా, సందేశాత్మకమైన అంశాలు ప్రస్తావించేవారు. విశ్వనాథ, శ్రీశ్రీ, సినారె వంటి కవులున్న సందర్భంలో కూడా తన భావాలను నిర్మొహమాటంగా వ్యక్తీకరించేవారు. ఆయన కవి, నవలాకారుడు, నాటక రచయిత, కథా విమర్శకుడు, అనువాదకుడు, పరిశోధకుడు. ఇన్ని లక్షణాలు ఒకే వ్యక్తిలో ఉండటం అరుదు. **'నా అక్షరాలే నా అశ్రువులు'** అనిఆయన అభివర్ణించారంటే దాని వెనకాల ఉన్న ఆర్ద్రత,నిస్పృహ, నిస్సహాయతలను గుర్తించవచ్చు. కేంద్ర, రాష్ట్రాల సాహిత్య అకాడమీ పురస్కారాలు, జ్ఞానపీఠ వారి మూర్తిదేవి అవార్డు, పద్మశ్రీ, వంటి ఎన్నెన్నో గౌరవాలు ఆయనకు ఊరికే దక్కలేదు. నిజాయితీగా ఆయన సాగించిన సుదీర్ఘ సాహిత్య తపస్సుకు అవి ఫలాలు" అని అన్నారు. తాను భారత ప్రధాన న్యాయమూర్తిగా ఉన్నప్పుడు దేశం నలువైపులా పర్యటించి రాజ్యాంగ సంస్కృతి హక్కుల గురించి ప్రజలకు చెప్పే ప్రయత్నం చేశానన్నారు. దేశంలో భారత రాజ్యాంగ సంస్కృతిని వ్యాప్తిలోకి తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. అయితే కేవలం తనలాంటి వారి ప్రసంగాలతో రాజ్యాంగ సంస్కృతిని వ్యాప్తిలోకి తేవడం సాధ్యం కాదని ఆచార్య ఇనాక్ చూపిన బాటలో సాహితీవేత్తలు, సాంస్కృతిక సంస్థలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. అక్కినేని నాగేశ్వరరావు నాటక కళాపరిషత్ అధ్యక్షులు సారిపల్లి కొండలరావు ప్రారంభోపన్యాసం చేయగా, ఏపీ శాసనసభ పూర్వ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్ విశ్రాంత ఐఏఎస్ అధికారి కాకి మాధవరావు సాహితీవేత్త ఓలేటి పార్వతీశం మాట్లాడారు. నిర్వాహకులు లంక లక్ష్మీనారాయణ స్వాగతం పలికారు. కొలకలూరిఇనాక్ స్పందించారు. పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం పీఠాధిపతి (పరీక్షా విభాగం) ఆచార్య కొలకలూరి మధుజ్యోతి అభినందనలు తెలిపారు. నిర్వహణ కమిటీ సభ్యులు ఎం. ఎహమీద్ వందన సమర్పణచేశారు. అంతకు ముందు స్వర్ణయుగ సినీ సంగీత విభావరి ఆకట్టుకుంది.



కొలకలూరి ఇనాక్‌కు జీవన సాఫల్య పురస్కారం, స్వర్ణకంకణ ప్రదానోత్సవంలో జస్టిస్ ఎన్.వి.రమణ. చిత్రంలో ఓలేటి పార్వతీశం, కాకి మాధవరావు, మండలి బుద్ధప్రసాద్, సారిపల్లి కొండలరావు, కొలకలూరి మదుజ్యోతి, డా॥ కె.వి.రమణాచారి.

# మనసును ఆలింగనం చేసుకునే 'మనిషిని కలిసినట్టుండాలి'






తెలుగు సాహిత్యంలో పరిచయం అక్కర్లేని పేరు ఆచార్య గోపి గారిది. ఐదున్నర దశాబ్దాల సాహిత్య జీవితంలో ఐదున్నర పదుల గ్రంథ ప్రచురణలతో అలుపెరుగని బాటసారి ఆయన. వేర్వేరు భాషల్లోకి అనువాద రూపంలో వచ్చిన ఆయన కవిత్వం 64 గ్రంథాలుగా ప్రచురితమైంది. ఈ విధంగా తెలుగు భాషకే పరిమితం కాకుండా జాతీయ కవిగానూ గుర్తింపు పొందారు. సాహిత్య రంగంలో నిరంతరం కృషి చేస్తోన్న ఆచార్య ఎన్. గోపి దాదాపు ప్రతి ఏటా ఒక గ్రంథాన్ని ప్రచురిస్తున్నారు. 2016 నుండి నాలుగేళ్ల కాలంలో రాసిన కవితల్లోనుండి 353 కవితలను ఎంపిక చేసి సప్తతి సందర్భంగా 'మనిషిని కలిసినట్టుండాలి' అనే పేరుతో బృహత్కవితాసంపుటిని గోపి రూపొందిం చారు. అడుగడుగునా ఉత్తమ కవిత్వ పంక్తులతో పాఠకులను అలరించే కవితాసంపుటి ఇది. 'సంభాషణ/ మనసుల మధ్య ఒక వీణ' అని ప్రకటించే ఆచార్య ఎన్.గోపి పాఠకులతో జరిపే సంభాషణే 'మనిషిని కలిసినట్టుండాలి'.

గోపి కవితాశీర్షికలు ఒకట్రెండు పదాలతోనో చిన్నపాటి సమాసాలతోనో ఆకట్టుకునేలా ఉంటాయి. కవితా వస్తువును నేరుగా ప్రకటిస్తాయి ఈ శీర్షికలు. 'భువనగిరి గుట్ట', 'నిశ్శబ్దం', 'అనిశ్చితి', 'నా భాష', 'యాంత్రికత', 'అఖండ పుష్పం', 'ముగ్గు తునక', 'శిఖర స్వప్నం' మొదలైన శీర్షికలను దీనికి ఉదాహరణలుగా చెప్పవచ్చు. కొన్ని శీర్షికలు స్టేట్ మెంట్లుగా కూడా ఉండడాన్ని గోపి కవితల్లో చూడవచ్చు. 'మనిషంటే ఒక వాతావరణం', 'స్పర్శ మోసం చేయదు', 'సముద్రం ఒక గ్రంథం', 'మనసే ఒక అద్దం', 'చింతా ఒక నేత్రమే' మొదలైన స్టేట్ మెంట్లతో శీర్షికలు ఉండడాన్ని గమనించవచ్చు.

తెలంగాణ మట్టి బహుభాషా పరిమళాలను వెదజల్లుతుంది. ఈ నేలపై పుట్టిన కవులు, రచయితల రచనల్లో ఆ పరిమళాలు గుబాళిస్తూ ఉంటాయి. ఆచార్య గోపి కూడా అందుకు మినహాయింపు కాదు. గోపి అలవోకగా ప్రయోగించే పరభాషా పదాలు పాఠకుడి మస్తిష్కంలోకి కవితావస్తువును సమర్థవంతంగా చేరుస్తాయి. ఉప్మాలో జీడిపప్పులా కవిత్వపాకానికి రుచిని చేరుస్తాయి. కవితా శీర్షికల్లోనూ ఈ విషయాన్ని చూడవచ్చు. 'ఎలాన్', 'ప్రిజన్', 'ఆక్రోశ్', 'సిమెట్రీ', 'సడక్', 'షికాయత్', 'ఔర్ ఏక్ బార్', 'జమానా బదల్ గయా' మొదలైన శీర్షికలను ఇందుకు ఉదాహరించవచ్చు.

తక్కువే అయినా కవిత్వంలోనూ అక్కడక్కడా ఇలాగే పరభాషాపదాల ప్రయోగం కనబడుతుంది. 'ఆశ' అనే కవిత ఇలా సాగుతుంది.

**"ఇన్ స్టాంట్ మార్పులు**
**సాధ్యం కాకపోవచ్చు**
**ఫిర్ భీ**
**అతని ఛాతిలో**
**ఓ హృదయాన్ని అమరుద్దాం**
**ఏమౌతుందో తెలియదు గాని**
**కవి కావడం మాత్రం తథ్యం"**

'ఔర్ ఏక్ బార్' అంటూ సాగే కవితను చూద్దాం.

**"ఔర్ ఏక్ చాయ్ హోజాయ్**
**అన్నట్టుంది కవిత్వం**
**చదవనన్నా చదువు**
**రాయనన్నా రాయి**
**వొట్టిగ కూర్చుంటే**
**వట్టిపోవడం ఖాయం"**

ఈ పంక్తుల్లో చదవడం, రాయడం ప్రాముఖ్యతను వెల్లడిస్తారు కవి. చదవడమో రాయడమో చేయకపోతే పనికిరాకుండాపోవడం తప్పదన్న హెచ్చరిక కూడా ఇందులో ఉంది. ఈ పంక్తుల్లో కవిత్వ ప్రాశస్త్యాన్ని వెల్లడిస్తూ 'ఔర్ ఏక్ చాయ్ హోజాయ్ అన్నట్టుంద'ని పరభాషాపదాలతో కూడిన వాక్యాన్ని వాడారు. ఇదే కవితను మరో చోట కిందివిధంగా ఆస్వాదించవచ్చు.

**"ఔర్ తోడా సెహర్ హోజాయ్**
**ఈ నడకకు**
**గమనమే తప్ప**
**గమ్యం వుండదు**
**ఉంటే అది నువ్వే"**

గోపి కవిత్వం గొప్పదనమేమిటంటే పరభాషాపదాలను వాడినా, మాండలిక పదాలను వాడినా అవి పాలలో నీళ్లలా ఆయన కవిత్వంలో కలిసిపోతాయి. తొలకరి పలకరించినప్పుడు గాలి వెదజల్లే మట్టి వాసన ఆయన కవిత్వం. అందుకే ఆయన కవిత్వానికి అంత పేరు.

తెలంగాణ పల్లె పదాలు, క్రియారూపాలు గోపి కవిత్వానికి సొగసునద్దుతాయి. 'కొనసాగింపు' అనే కవితలో కిందివిధంగా పేర్కొంటారు.

**"లోకరీతులను సాధారణీకరించి**
**వెన్నగా చిలికిన జ్ఞానభాండాన్ని**
**ఏంజేసుకోవాలె"**

ఇక్కడ 'చేసుకోవడం' అనే క్రియను 'జేసుకోవాలె'గా ప్రయోగించడం కనబడుతుంది. తెలంగాణ వ్యావహారికంలో కచటతపలను గజడదబలుగా మార్చడం సర్వసాధారణం. అలా 'చేసుకొను' అనే పదాన్ని 'జేసుకొను'గా ప్రయోగించడాన్ని, క్రియారూపం చివర్లో 'ఇ'కారం బదులుగా 'ఎ'కారం ఉపయోగించడాన్ని ఈ పంక్తుల్లో చూడవచ్చు.

'వర్గం' అనే కవిత కిందివిధంగా ప్రారంభమవుతుంది.

**"ఒకప్పుడు**
**మా పనమ్మాయి రాకుంటే**
**బాసండ్లన్నీ నేనే కడిగేవాణ్ని**
**అవి నా తాజా కవితల్లా**
**తళతళలాడేవి"**

పై పంక్తుల్లో **'బాసండ్లు'** అనే తెలంగాణ ప్రాంతీయ పద ప్రయోగాన్ని గమనించవచ్చు. ఈ పదం అర్థం వంట పాత్రలు.

'కోతికి కొబ్బరి చిప్ప దొరకడమ'నేది తెలుగు సామెతల్లో విరివిగా ప్రచారంలో ఉంది. దాన్నే మరోరకంగా చెప్తారు గోపి.

**"ఓ అమ్మాయి**
**మూడో అంతస్తుపై నుండి దూకి**
**చనిపోతుంది**
**ఈ పవిత్ర ప్రపంచం**
**ఆమెను ఎట్లా గాయపర్చిందో తెలియదు**
**మీడియా కోతులకు**
**కొబ్బరి కాయలు దొరుకుతాయి**
**అందరికీ**
**తాము చేస్తున్నది సేవే అనిపిస్తుంది"**

ఒక సంఘటనను కవిత్వీకరిస్తూ వ్యంగ్యాన్ని, విమర్శను, వ్యాఖ్యను చేర్చడం అందరివల్లా అయ్యే పని కాదు. పై వాక్యాల్లో అమ్మాయి ఆత్మహత్య సంఘటన. ఈ విషాదం వెనుక ఉన్నది ఆమె చుట్టూ ఉన్న సమాజం. సమాజంలోని ఎవరో ఒకరు గాయపరచడం ఆమెను ఆత్మహత్యకు పురికొల్పిందని కవి భావం. ఇక్కడ 'పవిత్ర ప్రపంచం' అనడంలో వ్యంగ్యం ఉంది. సమాజం గాయపర్చింది అనడంలో సమాజంపై విమర్శ ఉంది. ఈ సంఘటనపై మీడియా చిలవలు పలవలు అల్లి అరగంటలో అరవైసార్లు ప్రేక్షకలోకానికి అందిస్తుంది. ఈ వాక్యాల్లో కూడా 'మీడియా కోతులకు కొబ్బరికాయలు దొరుకుతాయి' అనడం వ్యంగ్యంతో కూడిన విమర్శ. మనసుకు గాయాలు, ఆత్మహత్య, మీడియా అత్యుత్సాహం- ఈ అన్నిటిపై కవి చేసిన వ్యాఖ్య 'అందరికీ తాము చేస్తున్నది సేవే అనిపిస్తుంది' అని.

నిత్యసత్యాలు గోపి కవితల్లో అక్కడక్కడా కనబడతాయి. 'నిస్సహాయత' అనే కవితలో కవి కింది విధంగా పేర్కొంటారు.

**"ఆపుకున్న కన్నీరు**
**రాలక తప్పదు**
**ఆకూ నేలను చేరక తీరదు**
**ఇక చెట్టుకు**
**స్పష్టత రావటమే ఆలస్యం"**

ఈ పంక్తుల్లో రెండు నిత్య సత్యాలున్నాయి. కన్నీరు ఎప్పుడో ఒకప్పుడు కిందికి రాలుతుందని, ఆకు తప్పకుండా నేలను చేరుతుందని. ఆకును కోల్పోతున్న విషయంలో చెట్టుకు స్పష్టత రావాలనడం ఈ సందర్భంలో ప్రస్తావించదగింది. ఈ ఒక్క వాక్యంలో అనంతమైన తత్త్వం దాగుంది. మనిషీ అంతేగదా! ఎప్పుడో ఒకప్పుడు చుట్టూ ఉన్న మనుషుల్లో ఎవరో ఒకరు దూరం కాక తప్పదు. ఈ ఫిలాసఫీని ఒంటబట్టించుకుంటే నిర్వేదంతో పాటు ఆనంద జీవనమూ సాధ్యమే!

చిన్న పరిమాణంలో ఉన్న వస్తువుకు అస్తిత్వమూ తక్కువగానే ఉంటుంది. ఎక్కువ పరిమాణం ఉంటే ఉనికిని కచ్చితంగా చెప్పవచ్చు. 'సంచార గీతం' కవితలో కవి ఇలా పేర్కొంటారు.

**"విస్తీర్ణం పెరిగినప్పుడల్లా**
**అస్తిత్వం స్పష్టమౌతుంది**
**మనిషి ఒక విరాట్ స్వరూపమై**
**కనిపిస్తాడు"**

విస్తీర్ణం పెరిగినప్పుడల్లా ఉనికి స్పష్టమవుతుం దన్న నిత్య సత్యం ఈ పంక్తుల్లో ఉంది.

సీనియర్ కవి గోపి కవిత్వంలో బలమైన వ్యక్తీకరణాలు కనబడతాయి. 'ది గైడ్' కవితలో కోటలో కనబడ్డ గైడుపై తన అభిప్రాయాన్ని కింది విధంగా వ్యక్తీకరిస్తారు.

**"వయస్సు పైబడింది**
**ముడుతలు పడిన ముఖంతో**
**ప్రాధేయపడుతున్నాడు**
**కోటలాగే**
**శిథిలదేహం నుండి**
**కాలాన్ని రాలుస్తున్నాడు"**

కోటకూ గైడుకూ సమాన ధర్మాన్ని కవి ఇక్కడ చెప్తున్నారు. కాలం గడుస్తున్నకొద్దీ కోట నుండి మట్టి, దుమ్ము రాలిపోతాయి. అలాగే ఆ గైడు కూడా కాలాన్ని రాలుస్తాడని కవి భావం. 'దేహం నుండి కాలాన్ని రాల్చడం' గొప్ప వ్యక్తీకరణ.

మనిషికీ మనిషికీ మధ్య 'అన్న', 'అక్క' మొదలైన పిలుపులతో సాన్నిహిత్యం ఏర్పడుతుంది. దీర్ఘకాల సాన్నిహిత్యం పేర్ల స్థానంలో వరుసలే మిగిలేలా చేస్తుంది. ఇదే విషయాన్ని'సంచార గీతం' అనే కవితలో చక్కటి వ్యక్తీకరణతో వెల్లడిస్తారు కవి.

**"వ్యక్తిగత సంబంధాలు**
**మానవానుబంధాలౌతాయి**
**పేర్లు మాయమై**
**వేర్లు మిగులుతాయి"**

ఈ పంక్తుల్లో 'పేర్లు మాయమై వేర్లు మిగులుతాయ'నడం పరస్పర సంబంధాలపై సునిశిత పరిశీలనతో ఏర్పడ్డ అభిప్రాయం.

కొత్త కవులకూ ఉత్తేజాన్ని కలిగించడం, ప్రోత్సాహాన్ని అందించడం ఆచార్య గోపి నైజం. నానీలతో కొత్త కవులు సైతం ఆడుతూ పాడుతూ కవిత్వం రాసేలా చేసిన అనుభవం ఆయన సొంతం. ఈ సులక్షణమే 'కొత్త కవి' అనే కవితలోని పంక్తుల్లో బయటపడుతుంది.

**"ఒక కవి వస్తున్నాడంటే**
**తాజా గాలి వీస్తున్నట్టు**
**ఏదైనా రాయనివ్వండి**
**ముందుగా వ్యక్తం కానివ్వండి**
**మన కొలతల్తో**
**అతనిలో కలతలు రేపొద్దు"**

కొత్త కవి ఆగమనాన్ని తాజా గాలి వీయడంతో పోల్చిన గోపి వ్యక్తిగతంగానూ కొత్త కవుల కవిత్వాన్ని అంతే ఆసక్తితో చదువుతారు. కొత్త కవులన్నా, కొత్తగా వస్తోన్న కవిత్వమన్నా అంత ప్రేమ, వాత్సల్యం ఉండబట్టే 'సృష్టి' అనే కవిత ఇలా రూపొందింది.

**"ముందుగా నేను**
**కవిత్వమే చదువుతాను**
**రాసినవారి పేరు చూడను**
**కాలింగ్ బెల్ నొక్కకుండా**
**ఇంటిలోకి ప్రవేశించినట్టు**
**ఒక్కొక్క పంక్తినే దాటుకుంటూ**
**గుండె గదుల్లో సంచరిస్తాను"**

ఇలా కవి పేరు చూడకుండా కవిత చదవడం వల్లే కొత్తగా వస్తోన్న కవులకు ఆదరణ లభిస్తుంది. ఈ విషయం బాగా తెలిసినవారు గోపి.

కుప్పంలోని ద్రావిడ విశ్వవిద్యాలయానికి 2001 లో ఇన్చార్జి వీసీగా వ్యవహరించారు ఆచార్య గోపి. పదిహేనేళ్ల తర్వాత అక్కడికి వెళ్ళినప్పుడు పాత జ్ఞాపకాలను తవ్వుకుంటూ రాసిన కవిత 'ద్రావిడ సూక్తం' ఆ కవితలో దక్షిణాది భాషలను ప్రస్తావించడం కనిపిస్తుంది.

**"ఆకాశం అదే**
**మేఘాల్లోనే తేడా**
**చెట్లు నాలుగు భాషలు**
**మాట్లాడుతున్నట్టు**
**ఒక మణిప్రవాళ స్ఫురణ**
**కాస్త తెలుగు, స్వల్ప కన్నడ**
**కొంజెం తమిళం, కొంచెం మలయాళం**
**ఒకేచోట దర్శనమిస్తున్న**
**దక్షిణాపథం"**

ఈ కవితలోని పై పంక్తుల్లో మణిప్రవాళ శైలిని స్ఫురించేలా రాయడం గమనార్హం.

ప్రజలకు కొన్ని చిన్న చిన్న ఆశలుంటాయి. అవి నెరవేరితే చిన్నపాటి ఆనందాలు మనసులో పల్లవిస్తాయి. ఈ అంశంపై గోపి రాసిన కవిత 'చిన్న చిన్న సంతోషాలు'.

**"ఓ చాయ్ దుకాణం దగ్గర ఆగి**
**కబుర్లను చప్పరించడం**
**ఎక్కడ అయిపోతుందోనని**
**అపురూపంగా సిగరెట్టు కాల్చుకోవడం"**

చూసేవాళ్ళంతా కవి చాయ్ చప్పరిస్తున్నారనుకుంటారు. కానీ నిజానికి కవి చప్పరించేది చుట్టూ ఉన్న మిత్రులతో కబుర్లు. తినే వస్తువును నెమ్మది నెమ్మదిగా ఆస్వాదిస్తూ తినడంలో ఒక మజా, ఒక ఆనందం ఉంటాయి. అపురూపంగా చూస్తూ ఆస్వాదన చేయడంలో నిజమైన ఆనందం ఉంది. పై పంక్తుల్లో అదే విషయాన్ని సిగరెట్టు తాగడానికి వర్తింపజేశారు కవి. ఇదే కవితలో మైలు రాళ్ల మీది అంకెలను 'దూరం తాడు మీద ఆరేసిన/ ఆశల కాలమాలికలు'గా పేర్కొంటారు.

ఈ సంపుటిలో టైటిల్ కవిత 'మనిషిని కలిసినట్టుండాలి'. మనుషులు పరస్పరం కలిసినప్పుడు ఎలా ఉండాలో తెలియజేస్తుందీ కవిత.

**"ఎవరినైనా కలిస్తే**
**మనిషిని కలిసినట్టుండాలి**
**పచ్చని చెట్టు కింద**
**సేదదీరినట్టుండాలి"**

మనుషుల్లో నిజాయితీ లేని కాలమిది. మానవ సంబంధాల్లోనూ నిజాయితీ లేమి అడుగడుగునా దర్శనమిచ్చే కాలమిది. మనుషుల్లోని మనిషితనం, మానవత్వం దూరం కాకూడదన్న కవి భావన ఈ పంక్తుల్లో ప్రస్ఫుటమవుతుంది. మానవ సంబంధాలపై ఆచార్య గోపికి ఉన్న నమ్మకానికి, ప్రీతికి అద్దం పట్టే వాక్యాలివి. కవి చెప్పినట్టు ఒకరిని ఒకరు కలిస్తే ఆ కలయిక మనసును సేదదీర్చుకునేలా ఉండాలి. గోపి కవిత్వమంతా ఇంతే! పాఠకుడిని సేదదీర్చేలా ఉంటుంది. ఒంటరితనాన్ని దూరం చేసేలా ఉంటుంది. ఒక ఆప్తుని కరస్పర్శలా ఉంటుంది. మనసును ఆలింగనం చేసుకున్నట్టుగా ఉంటుంది.

ప్రతులకు:
-డా॥ ఎన్. గోపి
సెల్:9391028496



-డా. రాయారావు
సూర్యప్రకాశ్ రావు,
9441046839

# సద్విమర్శక వతంసులు ఆచార్య ఎస్వీ రామారావు

**- అధికార భాషా సంఘం అధ్యక్షురాలు మంత్రి శ్రీదేవి**

సుప్రసిద్ధ సాహిత్య పరిశోధకులు, రచయిత, ఉస్మానియా విశ్వవిద్యాలయం మాజీ తెలుగు శాఖాధ్యక్షులు, మాజీ డీన్, సద్విమర్శక వతంసులు, అక్షర తపస్వి ఆచార్య ఎస్వీ రామారావు అని రాష్ట్ర అధికార భాషా సంఘం అధ్యక్షురాలు మంత్రి శ్రీదేవి పేర్కొన్నారు. జూన్ 5 న హైదరాబాద్ లోని శ్రీకృష్ణదేవరాయ తెలుగు భాషా నిలయంలో సాహితీ జిగీష సాహిత్య, సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో జరిగిన ఆచార్య ఎస్వీ రామారావు 83 వ జన్మదినోత్సవ అభినందన సంచిక "అక్షరదీపం", "సమగ్ర తెలంగాణ వాఙ్మయ కోశం" పుస్తకావిష్కరణ, సహస్రపూర్ణ చంద్రదర్శనం కార్యక్రమానికి మంత్రి శ్రీదేవి ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిరంతరం సాహిత్యసేవలో నిమగ్నమవుతూ అనేక పుస్తకాలను వెలువరించిన ఎస్వీ రామారావు తెలుగు సాహిత్యంలో విమర్శకగ్రేసరులుగా పేరు సంపాదించుకున్నారన్నారు. అటు తెలుగు సాహిత్య చరిత్రను, ఇటు తెలంగాణ సాహిత్య చరిత్రలను రచించడంతో పాటు జిల్లా చరిత్రలను కూడా వెలువరించడం గొప్ప విషయమన్నారు. 83 సంవత్సరాలు వచ్చినా కూడా నిత్యం సాహితీ యజ్ఞం చేయడం సామాన్యమైన విషయం కాదన్నారు. ఎంతోమంది రామారావు దగ్గర ఎం.ఫిల్, పిహెచ్.డి పరిశోధనలు చేశారన్నారు. మరెంతోమంది కవులుగా, రచయితలుగా రాణిస్తున్నారన్నారు. ఎంతోమందికి విద్యాదానం చేసిన గొప్ప అధ్యాపకులు అని కొనియాడారు. తెలుగు సాహిత్యంలో ఆచార్య ఎస్వీ రామారావు రచనలు ఆచంద్రార్కం నిలిచిపోతాయన్నారు. గౌరవ అతిథిగా విచ్చేసిన తెలుగు విశ్వవిద్యాలయం పూర్వ రిజిస్ట్రార్ ఆచార్య టి.గౌరీశంకర్ మాట్లాడుతూ ఆచార్య ఎస్వీ రామారావు రచించిన "సమగ్ర తెలంగాణ వాఙ్మయ కోశం" భావి పరిశోధకులకు ఉపయుక్త గ్రంథమని, ప్రతి ఒక్కరు చదువవలసిన పుస్తకరాజమని ప్రశంసించారు. తొలి తెలుగు కవి నన్నయ కాదని అంతకంటే ముందే తెలంగాణకు చెందిన "కవిజనాశ్రయం" గ్రంథాన్ని రచించిన మల్లియ రేచన తొలి తెలుగు కవి అని పరిశోధన చేసి తెలుగు సాహిత్యలోకానికి అందించారన్నారు. రామారావు సృజనాత్మక రంగంలోకి పోకుండా విమర్శ, పరిశోధన రంగంలో ప్రవేశించి తనదైన పాండిత్యాన్ని ప్రదర్శింపజేశారన్నారు. రామారావు పరిశోధన గ్రంథం "తెలుగులో సాహిత్య విమర్శ" ఇప్పటికీ తెలుగు సాహిత్యంలో ప్రామాణిక గ్రంథమని పేర్కొన్నారు. రామారావు విశేషంగా కృషి చేసి తెలంగాణ సాహిత్య చరిత్ర, సమగ్ర తెలుగు సాహిత్య చరిత్ర గ్రంథాలను రచించి నేటి పరిశోధకులకు ఎన్నో తెలియని విషయాలను తెలియజేశారన్నారు. సభకు అధ్యక్షత వహించిన ప్రముఖ పాత్రికేయులు టి.ఉదయవర్లు మాట్లాడుతూ ఆచార్య ఎస్వీ రామారావు యువరచయితలతో పోటీపడుతూ నేటికీ రచనలు చేస్తుండడం అరుదైన విషయమన్నారు. సుదీర్ఘమైన సాహిత్యసేవ చేసి విమర్శకుడిగా పేరు ప్రఖ్యాతులు సంపాదించుకున్న రామారావు నిగర్వి, స్నేహశీలి అని ప్రశంసించారు. అనంతరం "నేటి నిజం" దినపత్రిక రూపొందించిన ఆచార్య ఎస్వీ రామారావు జ్ఞాపికను పత్రిక సంపాదకులు బైస దేవదాసు, పాలమూరు సాహితి అధ్యక్షులు డాక్టర్ భీంపల్లి శ్రీకాంత్ లు అందజేశారు. ఈ సందర్భంగా పలు సంస్థల ప్రతినిధులు ఆచార్య ఎస్వీ రామారావును ఘనంగా సన్మానించారు.

ఈ కార్యక్రమంలో ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగు శాఖ పూర్వ అధ్యక్షులు ఆచార్య వెల్దండ నిత్యానందరావు, హైమావతి భీమన్న, డాక్టర్ చిల్లర భవానీదేవి, డా. రాపోలు సుదర్శన్, తెలంగాణ సారస్వత పరిషత్తు కోశాధికారి మంత్రి రామారావు, పెద్దూరి వెంకటదాసు, సాహితీ జిగీష అధ్యక్షులు బండారుపల్లి రామచంద్ర రావు, ప్రధాన కార్యదర్శి డాక్టర్ పి.లలితవాణి, ఉపాధ్యక్షులు రఘుశ్రీ, సంయుక్త కార్యదర్శి డాక్టర్.పి.వి.ఉమాశశి, అరుణ ధూళిపాళ, డాక్టర్ ఆర్.కమల, తదితరులు పాల్గొన్నారు.



'అక్షర దీపం' అభినందన సంచికను ఆవిష్కరిస్తున్న తెలంగాణ అధికార భాషా సంఘం అధ్యక్షురాలు శ్రీమతి మంత్రి శ్రీదేవి. వేదికపై ఆచార్య టీ. గౌరీశంకర్, ఆచార్య ఎస్వీ రామారావు, డా॥ లలితావాణి, టి. ఉదయవర్లు.



ఆచార్య ఎస్వీ రామారావుకు జ్ఞాపికను అందజేస్తున్న నేటినిజం పత్రిక సంపాదకులు బైస దేవదాసు, భీంపల్లి శ్రీకాంత్. వేదికపై మంత్రి శ్రీదేవి, టి. ఉదయవర్లు తదితరులు.



సభలో ప్రసంగిస్తున్న ఆచార్య ఎస్వీ రామారావు. వేదికపై మంత్రి శ్రీదేవి. టి. ఉదయవర్లు, ఆచార్య టీ. గౌరీశంకర్.

